క్లుప్తంగా

డబుల్ ఇళ్ల కోసం దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్‌రూరల్: ఆదిలాబాద్ రూరల్ మండలంలోని ఆదిలాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని అనుకుంట, బేల్లూరి, రాంపూర్ ప్రాంతాల్లో నివాసం ఉండే వారి నుంచి డబుల్ బెడ్‌రూం ఇళ్ల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తహసీల్దార్ శివరాజ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 8 నుంచి 10 వరకు దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందన్నారు. .

పాడి రైతుల అభివృద్ధే లక్ష్యం

కైలాస్‌నగర్: పాడి రైతుల సంక్షేమమే లక్ష్యంగా విజయ డెయిరీ పని చేస్తోందని బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు అన్నారు. విజయ డెయిరీ అధికారులు శనివారం టైలర్స్ కాలనీలోని ఆయన నివాసంలో ఎమ్మెల్యేను కలిశారు. డెయిరీ ద్వారా అందిస్తున్న సేవలు, బోథ్ నియోజకవర్గంలోని పలు మండలాల్లో ఏర్పాటు చేయనున్న పాలశీతలీకరణ కేంద్రాల గురించి వివరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పాడి రైతులను ఆదుకునేలా వివిధ కార్యక్రమాలు చేపట్టాలన్నారు.

మొరం తవ్వకాలు చేపడితే చర్యలు

తలమడుగు: ప్రభుత్వ భూముల్లో మొరం తవ్వకాలు చేపడితే చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ వనజారెడ్డి అన్నారు. శనివారం తలమడుగు తహసీల్దార్ కార్యాలయంలో ఆమె మాట్లాడారు. గతంలో ప్రభుత్వం నిరుపేదలకు అసైన్డ్ భూమి పంపిణీ చేయడం జరిగిందని, కొందరూ మొరం తవ్వకాలు చేపట్టి వ్యవసాయేతర పనులకు వినియోగిస్తున్నారన్నారు. అలాంటి వారికి నోటీసులు ఇస్తామన్నారు.

పర్సు అందజేత

ఇచ్చోడ: ఆదిలాబాద్ నుంచి నిర్మల్ వెళ్లే ఆర్టీసీ బస్సులో శనివారం సాయంత్రం ఓ మహిళ ప్రయాణికురాలు పర్సు మర్చిపోయి ఇచ్చోడ బస్టాండ్‌లో బస్సు దిగింది. ఇది గమనించిన కండక్టర్ దేవన్న డిపో అధికారులకు సమాచారం ఇచ్చారు. అధికారులు మహిళ వివరాలు కనుక్కొని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో పర్సును ఆమెకు అప్పగించారు. కండక్టర్ దేవన్న, డ్రైవర్‌లను ఎస్సై శ్రీకాంత్, ఆదిలాబాద్ ఆర్టీసీ డీఎం కల్పన, సేఫ్టీ వార్డెన్ యూసుఫ్ అభినందించారు.

బకాయిలు విడుదల చేయాలి

ఆదిలాబాద్‌అర్బన్: ఉద్యోగ, ఉపాధ్యాయులకు, పెన్షనర్లకు ప్రభుత్వం నుంచి రావాల్సిన జీపీఎఫ్, మెడికల్ రియంబర్స్‌మెంట్, టీఎస్ జీఎల్ఐ, సీపీఏ పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని బీజేపీ రిటైర్డ్ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల విభాగం నాయకులు నల్ల రత్నాకర్ రెడ్డి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రతీ నెల ఒకటో తేదీన జీతాలు చెల్లించాలన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపనకు ఆహ్వానం

నార్నూర్: మండల కేంద్రంలోని విజయ్‌నగర్ కాలనీలోని వేంకటేశ్వర ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సర్పంచ్ బానోత్ గజానంద్‌నాయక్ అన్నారు. శనివారం ఎంపీ సోయం బాపురావు, బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు, మాజీ ఎంపీ గోడం నగేశ్‌లను వారి స్వగృహంలో కలిసి ఆహ్వానం అందజేశారు. 12న విగ్రహ ప్రతిష్ఠాపన ఉంటుందన్నారు. జేఈఈ ధర్మేందర్ ఆడే, బాలాజీ, తదితరులు ఉన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

ఉట్నూర్‌రూరల్: ప్రతిఒక్కరికీ చట్టాలపై అవగాహన అవసరమని న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ దుర్గారాణి అన్నారు. శనివారం మండలంలోని ఘన్‌పూర్ గ్రామంలో చట్టాలపై అవగాహన కల్పించారు. ఉచిత న్యాయ సహాయం, మోటార్ వెహికల్ చట్టం, తదితర అంశాలను వివరించారు. కార్యక్రమంలో న్యాయవాదులు పెందూర్ ప్రభాకర్, జైవంత్‌రావు, రాజు, సర్పంచ్ పంద్ర లత, రాజ్‌గోండ్ సేవా సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అర్క సీతారాం, గ్రామస్తులు పాల్గొన్నారు.

నైపుణ్యత పెంపొందించుకోవాలి

ఇచ్చోడ: గురుకుల పాఠశాల్లో నిర్వహించే వేసవి శిబిరాల ద్వారా విద్యార్థులో దాగి ఉన్న నైపుణ్యతను మరింత పెంపొందించుకోవాలని గిరిజన గురుకులాల ఉమ్మడి జిల్లా ఆర్సీవో గంగాధర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని గిరిజన గురుకుల బాలుర పాఠశాల్లో నిర్వహించిన వేసవి శిబిరంలో పాల్గొని మాట్లాడారు. ఇచ్చోడలో 15 రోజుల పాటు విద్యార్థులకు వివిధ రంగాల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పిన్సిపాల్ రాజేంద్ర ప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.

బజరంగ్‌దళ్‌ను నిషేధిస్తామని ప్రకటించడం సిగ్గుచేటు

బేల: కర్నాటకలో కాంగ్రెస్ అధికారంలో వస్తే బజరంగ్‌దళ్‌ను నిషేధిస్తామని ప్రకటించడం సిగ్గుచేటని బజరంగ్ దళ్ మండల అధ్యక్షుడు అగార్కర్ అకాష్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో మాట్లాడారు. కాంగ్రెస్ హిందువుల మనోభావాలను దెబ్బతీసే విధంగా వ్యవహరిస్తుందని ఆరోపించారు. సభ్యులు బర్కాడే రాము, ప్రీతం, మనోజ్‌రెడ్డి, మహేందర్, అనికేత్, సాయి, చరణ్ పాల్గొన్నారు.

సెలవుల్లో ఉచిత శిక్షణ



నృత్య ప్రదర్శనలో చిన్నారులు

- సృజనాత్మకతను వెలికి తీసేలా..
- నచ్చిన రంగాలను ఎంచుకునే అవకాశం
- చిన్నారులకు అండగా బాల కేంద్రం
- శిక్షణ శిబిరానికి అనూహ్య స్పందన



సంగీతం నేర్చుకుంటున్న చిన్నారులు



తబలా నేర్పిస్తున్న గురువు

కైలాస్‌నగర్: వేసవి సెలవుల్లో చిన్నారులు సెల్‌ఫోన్లలో లీనమైపోకుండా జిల్లా కేంద్రంలోని బాల కేంద్రం వారికి ప్రత్యేక శిక్షణ ఇస్తోంది. వివిధ కళారంగాల్లో రాణించేలా, చిన్నారుల్లో దాగి ఉన్న సజనాత్మకతను వెలికి తీయడంతో పాటు నైపుణ్యాన్ని పెంపొందించి కళాకారులుగా తీర్చిదిద్దేలా వివిధ అంశాల్లో మెళుకువలను నేర్పిస్తోంది. వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా బాల కేంద్రంలో కూచిపూడి, భరతనాట్యం, జానపద, లలిత సంగీతం, కర్ణాటక సంగీతం తబలా, హార్మోనియం, కరాటే, పియానో, డోలక్, చిత్రలేఖనం అంశాల్లో ఉచితంగా శిక్షణనందిస్తోంది. 5 నుంచి 16 సంవత్సరాల్లోపు విద్యార్థులు బాల కేంద్రంలో తమ పేర్లను నమోదు చేసుకుని తమకు నచ్చిన రంగంలో శిక్షణ పొందవచ్చు.

పేర్లు నమోదు చేసుకోవడం ఇలా..

ఆసక్తి గల విద్యార్థులు తమ పేర్లను నమోదు చేసుకుని ఏడాది పాటు శిక్షణ తరగతులకు హాజరు కావచ్చు. విద్యార్థి ఆధార్‌కార్డు, బర్త్ సర్టిఫికెట్, రెండు పాస్‌ఫొటోలు, రెండుసెట్ల జిరాక్స్ కాపీలతో ప్రతీ రోజు సాయంత్రం 5 గంటల నుంచి 8గంటల వరకు బాల కేంద్రంలో సంప్రదించి పేర్లను నమోదు చేసుకోవచ్చు. ఇప్పటి వరకు వేసవి శిబిరానికి 350 మందికి పైగా విద్యార్థులు తమ పేర్లను నమోదు చేసుకుని శిక్షణకు హాజరవుతున్నారు. ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు అలాగే సాయంత్రం 4గంటల నుంచి 7గంటల వరకు ఆయా రంగాల్లో అనుభవజ్ఞులైన నిపుణులచే శిక్షణ ఇస్తారు. శిక్షణ శిబిరంలో పాల్గొనే విద్యార్థులకు ఆయా రంగాల్లో శిక్షణన్విడంతో పాటు ముగింపు వేడుకల్లో జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా సర్టిఫికెట్స్ సైతం అందజేయనున్నట్లు బాల కేంద్ర పర్యవేక్షకుడు మిట్టు రవి తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

మహిళల ఆత్మగౌరవం రెట్టింపు చేస్తాం

- ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న
- మండల సమాఖ్య సభ్యులకు ట్రాక్టర్లు పంపిణీ



ట్రాక్టర్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రామన్న

ఆదిలాబాద్‌అర్బన్: మహిళల ఆత్మ గౌరవాన్ని రెట్టింపు చేస్తామని ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. జిల్లా కేంద్రంలోని టీటీడీసీ ప్రాంగణంలో జైనథ్, మావల, ఆదిలాబాద్ రూరల్ మండలాల ఐకేపీ మండల సమాఖ్య సభ్యులకు ట్రాక్టర్లు పంపిణీ చేశారు. ముందుగా ట్రాక్టర్లకు పూజలు చేసి నడిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆయా మండల సమాఖ్యలు రూ.7.50 లక్షలు చెల్లించగా.. ప్రభుత్వం రూ.2.50 లక్షలు సబ్సిడీ అందించిందన్నారు. కస్టమ్ హైరింగ్ సెంటర్ల కోసం ఐకేపీ మండల సమాఖ్యలకు ఒక్కొక్క ట్రాక్టర్‌ను అందిస్తున్నట్లు పేర్కొన్నారు. అవసరమైన వారు వీటిని వినియోగించుకుని అద్దె చెల్లించాలని, తద్వారా సమాఖ్యలకు ఆదాయం లభిస్తుందని వివరించారు. మహిళలు డబ్బులు పొదుపు చేస్తారన్న ఉద్దేశంతో మండల సమాఖ్యలకు ఈబాధ్యత అప్పగించినట్లు తెలిపారు. మహిళలు అన్ని రంగాల్లో ఎదిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మెట్టు ప్రహ్లాద్, పట్టణాధ్యక్షుడు అజయ్, నల్ల రాజేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిక

ఆదిలాబాద్‌అర్బన్: బీజేపీ మైనారిటీ సీనియర్ నాయకుడు అబ్దుల్ ఖాసీం శనివారం ఎమ్మెల్యే జోగు రామన్న సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఎమ్మెల్యే ఆయనకు కండువా పార్టీలోకి ఆహ్వానించారు. బీజేపీలో సరైన గుర్తింపు లభించడం లేదని, రాష్ట్ర ప్రభుత్వం, ఎమ్మెల్యే చేస్తున్న అభివృద్ధిని చూసి పార్టీలో చేరినట్లు అబ్దుల్ ఖాసీం తెలిపారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మెట్టు ప్రహ్లాద్, జైనథ్ ఎంపీపీ మర్సెట్టి గోవర్ధన్, అజయ్, నల్ల రాజేశ్వర్ పాల్గొన్నారు.

ఆసక్తి ఉన్న కోర్సులనే ఎంచుకోవాలి

తాంసి: పదో తరగతి, ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులు తమకు ఆసక్తి ఉన్న కోర్సులను ఎంచుకోవాలని సీనియర్ కౌన్సిలర్ మల్లేష్ విద్యార్థులకు సూచించారు. నిర్మాణ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మొబైల్ కెరీర్ ల్యాబ్ శనివారం కప్పర్ల గ్రామానికి చేరుకుంది. విద్యార్థులకు సంస్థ తరపున కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కల్పించారు. సర్పంచ్ సదానంద్, సిబ్బంది కలింగ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ మున్సిపల్ పరిధిలోని వార్డుల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎంఐఎం పట్టణాధ్యక్షుడు నజీర్ అహ్మద్ అన్నారు. శనివారం పట్టణంలోని కొలిపుర కాలనీలో పర్యటించారు. ఇంటింటికీ తిరుగుతూ ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ.. పట్టణంలోని 19 వార్డుల్లో నెలకొన్న సమస్యలను తెలుసుకునేందుకు ఇంటింటికీ తిరుగుతున్నామన్నారు. అనేక వార్డుల్లో సమస్యలు రాజ్యమేలుతున్నాయన్నారు.

చిన్నారికి మెరుగైన వైద్యం అందించాలి

నేరడిగొండ: చిన్నారికి మెరుగైన వైద్యం అందించాలని తెలంగాణ రాష్ట్ర లెక్చరర్ల సంఘం ప్రధాన కార్యదర్శి బలరాం జాదవ్ అన్నారు. మండలంలోని పటుపట్ తండా గ్రామానికి చెందిన వనిత కూతురు ప్రమాదవశాత్తు రోడ్డు ప్రమాదానికి గురై నిర్మల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. విషయం తెలుసుకున్న ఆయన శనివారం ఆసుపత్రికి చేరుకుని కుటుంబసభ్యులకు ధైర్యం చెప్పారు. వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని కోరారు.

'అవినీతి ఎమ్మెల్యేల వివరాలు బయటపెట్టాలి'

ఆదిలాబాద్‌రూరల్: దళితబంధు పథకంలో అవినీతి, అక్రమాలకు పాల్పడిన ఎమ్మెల్యేల చిట్టా సీఎం కేసీఆర్ బయటపెట్టాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ ఆరెల్లి మల్లేష్ డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని బాబు జగ్జీవన్‌రామ్ చౌక్‌లో కళ్లకు గంతలు కట్టి నిరసన తెలిపారు. ఎమ్మెల్యే జాబితాను గవర్నర్ తెప్పించుకోవాలన్నారు. ఈనెల 10న కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపడుతామని హెచ్చరించారు. జిల్లా కోకన్వీనర్లు పాలేపు గణేశ్, బరుకుంట సుభాష్, ఉప్పులేటి శ్రీను, ఆరెపల్లి గణేశ్, చందు, పసుల శ్రీకాంత్ పాల్గొన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి



సాఫ్ట్‌బాల్ శిక్షణ శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎస్సై

నేరడిగొండ: యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి, క్రీడల్లో రాణించాలని ఎస్సై సాయన్న అన్నారు. సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గస్కంటి గంగాధర్ ఆధ్వర్యంలో శనివారం మండలంలోని గుత్పాల గ్రామంలో శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. క్రీడలతోనే మానసికోల్లాసం కలుగుతుందన్నారు. అనంతరం సర్పంచ్ గస్కంటి రవి మాట్లాడుతూ.. గ్రామీణ యువకులు క్రీడల పట్ల మక్కువ పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా సంయుక్త కార్యదర్శి కులపాక నాగరాజ్, కార్యదర్శి మోహన్, కోచ్ రాజేశం, అనిల్, గ్రామస్తులు నర్సింగ్ దాస్, క్రీడాకారులు పాల్గొన్నారు.

16న క్రీడపోటీలు ప్రారంభం

గుడిహత్నూర్: ఈనెల 16న సీఎం కప్ క్రీడ పోటీలు ప్రారంభించనున్నట్లు ఎంపీడీవో సునీత తెలిపారు. శనివారం ఎంపీడీవో కార్యాలయంలో క్రీడ కమిటీ సమావేశం నిర్వహించారు. 16, 17న రెండు రోజుల పాటు క్రీడలు నిర్వహించడం జరుగుతుందన్నారు. అథ్లెటిక్స్, ఫుట్‌బాల్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీల్లో పాల్గొని క్రీడాకారులు ప్రతిభ చాటాలన్నారు. సమావేశంలో క్రీడ కమిటీ సభ్యులు తహసీల్దార్ సంధ్యారాణి, ఎంఈవో నారాయణ, పీఈటీ వివేక్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నార్నూర్: రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించే చీఫ్ మినిస్టర్ కప్ క్రీడ పోటీలను విజయవంతం చేయాలని ఎంపీడీవో రమేశ్ కోరారు. శనివారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మాట్లాడారు. ఎంపీపీ చైర్మన్‌గా ఈనెల 15 నుంచి 17 వరకు క్రీడ పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. వివరాలకు 93904 40120 సంప్రదించాలన్నారు. ఆసక్తిగల యువతీ, యువకులు తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

వైభవంగా హనుమాన్ శోభాయాత్ర



శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు

తాంసి: మండల కేంద్రంలో శనివారం హనుమాన్ దీక్షదారులు హనుమాన్ శోభాయాత్ర నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో భారీ హనుమాన్ ఉత్సవ విగ్రహాన్ని ఉంచి శోభాయాత్ర చేపట్టారు. గోపాలకృష్ణ మఠం పీఠాధిపతి యోగానంద సరస్వతి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. మహిళలు మంగళ హారతులతో పూజలు చేయగా.. హనుమాన్ స్వాములు డీజే చప్పుళ్లకు నృత్యం చేశారు. సర్పంచ్ కృష్ణ, గిరిజన మోర్చా బీజేపీ అధికార ప్రతినిధి సాకటి దశరథ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి కృషి

తలమడుగు: మండలంలోని బరంపూర్ కొండపై వెలిసిన శ్రీవేంకటేశ్వర ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని జెడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి అన్నారు. శనివారం ఆలయానికి ఆదిలాబాద్ మార్నింగ్ వాకర్స్ సభ్యులు లక్ష విలువ చేసే వాటర్ ఫ్రీజ్‌ను విరళంగా అందజేశారు. అలాగే జెడ్పీ, ఎంపీపీ రూ. 5 లక్షలతో నిధులతో నిర్మించిన వంట షెడ్డును ప్రారంభించారు. జెడ్పీటీసీ గణేశ్‌రెడ్డి మాట్లాడుతూ.. ఆలయ అభివృద్ధికి ఎల్లప్పుడు కృషి చేస్తానన్నారు. మార్నింగ్ వాకర్స్ సభ్యులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ కల్యాణ లక్ష్మి రాజేశ్వర్, మాజీ జెడ్పీటీసీ బాబన్న, మార్నింగ్ వాకర్స్ టీం అధ్యక్షుడు మేకల మల్లన్న, శేఖర్, గోవర్ధన్ రెడ్డి, కృష్ణారెడ్డి, వేణుగోపాల్ రెడ్డి పాల్గొన్నారు.

ఓటరు జాబితాపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్

ఇంద్రవెల్లి: మండలంలోని ఆయా రాజకీయ పార్టీల నాయకులకు, ప్రజాప్రతినిధులకు, బీఎల్‌వోలకు శనివారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఓటరు జాబితాపై అవగాహన కల్పించారు. నూతనంగా తయారు చేసిన ఓటరు జాబితాతో పాటు చేర్పులు, మార్పులు ఉంటే బీఎల్‌వోలను సంప్రదించాలన్నారు. రూ. 18 సంవత్సరాల నిండిన ప్రతిఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రమేశ్, ఆర్ఐ మెస్రం లక్షణ్, ఆర్క ఖమ్ము, మహ్మద్ అంజద్, షేక్ సుఫీయన్, మారుతి దేవ్‌పూజే పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్.. శిథిలావస్థలో కార్యాలయం



బేల: మండల కేంద్రంలో ఏళ్ల క్రితం నిర్మించిన తహసీల్దార్ కార్యాలయం శిథిలావస్థకు చేరుకుంది. గోడలకు పగుళ్లు ఏర్పడి, స్లాబ్ భాగం పెచ్చులూడుతోంది. దీంతో ఉద్యోగులు, ప్రజలు భయాందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి నూతన కార్యాలయం నిర్మించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

– సంబంధిత అధికారి: రాథోడ్ రమేశ్, ఆర్డీవో, ఫోన్: 94910 53611

ఆధ్యాత్మిక మార్గంలో నడవాలి



పల్లకి సేవలో పాల్గొన్న ఎమ్మెల్యే రామన్న

ఆదిలాబాద్: ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక మార్గంలో నడవాలని మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ అన్నారు. వైశాఖ పౌర్ణమి పురస్కరించుకొని శనివారం జిల్లా కేంద్రంలోని సుందరయ్య నగర్ కాలనీలో శ్రీజాగృతి దక్షిణామూర్తి హనుమాన్ మందిరంలో నిర్వహించిన అఖండ రామాయణ పారాయణలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. తులసీదాస్ రచించిన రామచరిత స్ఫూర్తిదాయకమన్నారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ పవన్ నాయక్, సంజీవ్ రెడ్డి, శ్రీధర్, శ్రవణ్ నాయక్, రాజు, విజయ్, దశరథ్, అర్చకులు ఆశిష్ పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక మార్గం అభినందనీయం

ఆదిలాబాద్: యువత ఆధ్యాత్మిక మార్గంలో పయనిస్తూ హనుమాన్ దీక్షలను స్వీకరించడం అభినందనీయమని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. వైశాఖ పౌర్ణమిని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని మహాలక్ష్మి వాడ కాలనీలోని హనుమాన్ మందిరంలో నిర్వహించిన అఖండ రామాయణ పారాయణం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై పల్లకి సేవలో పాల్గొన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ అడ్డీ భోజారెడ్డి, పందిరి భూమన్న, గణేశ్ నాయుడు, అశోక్, సాయి, సంజయ్ పాల్గొన్నారు.

పట్టుదలతో విజయం సాధించవచ్చు



బహుమతులు అందజేస్తున్న గోవర్ధన్‌రెడ్డి

ఆదిలాబాద్: పట్టుదలతో విజయం సాధించవచ్చని జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు బాలుడు గోవర్ధన్ రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని గిరిజన గురుకుల జూనియర్ కళాశాలలో నిర్వహించిన ఖోఖో క్రీడా వేసవి శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమానికి శనివారం హాజరయ్యారు. ఈ సందర్భంగా శిక్షణ శిబిరంలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు బహుమతులు ప్రదానం చేశారు. భవిష్యత్‌లో ఖోఖో, కబడ్డీ క్రీడలను ఒలింపిక్ మెగా ఈవెంట్లో సైతం గుర్తించే అవకాశం ఉందన్నారు. క్రీడాకారులు క్రీడా నైపుణ్యాలను మెరుగుపరుచుకొని గొప్ప క్రీడాకారులుగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు కోచ్ అతుల్, సురేశ్, రాజేశ్, ప్రతాప్ పాల్గొన్నారు.

'సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలి'



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న వీవోఏలు

బోథ్: వీవోఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావుకు శనివారం వినతిపత్రం అందజేశారు. తమకు రూ. 26 వేల వేతనం, ఉద్యోగ భద్రత, బీమా కల్పించాలన్నారు. బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి సాకటి దశరథ్, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు గొర్ల రాజు యాదవ్‌లు వీవోఏల సమ్మెకు మద్దతు తెలిపారు.

ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం

ఇంద్రవెల్లి: వీవోఏల సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని వీవోఏల మండల అధ్యక్షుడు షేక్ ఫెరోజ్ అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ వీవోఏలకు ఇచ్చిన హామీ నెరవేర్చాలన్నారు. కార్యక్రమంలో ఐకేపీ వీవోఏల సంఘం ఉపాధ్యక్షుడు కోట్నాక్ భారిక్ రావ్, వీవోఏలు జుగ్నాక్ రాందాస్, చంద్రకాంత్, జైపాల్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

సన్మానం

ఎదులాపురం: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 11 సంవత్సరాలు ఎస్‌పీసీ ఏడీగా సేవలందించి హైదరాబాద్ బండ్లగూడకు బదిలీ అయిన రాంటెంకి రఘునాథ్‌ను ఎస్‌పీసీ ఉద్యోగులు, సిబ్బంది శనివారం ఘనంగా సన్మానించారు. ఆయన మాట్లాడుతూ ఉద్యోగుల సహకారం వల్లే జిల్లాలో విశిష్టంగా సేవలందించానని తెలిపారు. కార్యక్రమంలో ఉద్యోగులు, సిబ్బంది కరుణాకర్, చంద్రశేఖర్, రమేశ్, మహేశ్, దీపక్, కదిరాబేగం, మెరివిక్టోరియా పాల్గొన్నారు.

బోథ్: బీజేవైఎం నూతన మండల కమిటీ సభ్యులను బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి సాకటి దశరథ్ పార్టీ కార్యాలయంలో సన్మానించారు. అధ్యక్షుడు ఓస సాయికుమార్, ప్రధాన కార్యదర్శి కార్తీక్‌లను సత్కారించారు. మండల అధ్యక్షుడు సుభాష్ సూర్య, జిల్లా కార్యవర్గ సభ్యులు వెంకటేశ్, తుకారాం, ఆకుల రాజేందర్, మానాల శేఖర్, రంజిత్ సింగ్, బారె భోజన్న, రవీందర్ పాల్గొన్నారు.

పరామర్శ

బోథ్: మండలంలోని పిప్పల్‌ధరి గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ ముత్యం రెడ్డి సోదరుడు బండారి భోజారెడ్డి ఇటీవల మృతి చెందారు. కాగా ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న శనివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. అలాగే నేరడిగొండ జెడ్పీటీసీ అనిల్ జాదవ్, బలరాం జాదవ్, బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి సాకటి దశరథ్, బోథ్ సర్పంచ్ సురేందర్ పరామర్శించారు.

బోథ్: మండలంలోని గుట్టపక్కతండా గ్రామానికి చెందిన ప్రతాప్‌సింగ్ తండ్రి ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎంపీపీ తుల శ్రీనివాస్ ఆయనను పరామర్శించారు. తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట పీఏసీఎస్ చైర్మన్ కదం ప్రశాంత్, సర్పంచులు, ఎంపీటీసీలు ఉన్నారు.

మునిరాం జాదవ్‌కు ఘన నివాళి

నార్నూర్: మండల వైస్ ఎంపీపీ జాదవ్ చంద్రశేఖర్ తండ్రి మునిరావు జాదవ్ (70) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. శనివారం మండలంలోని తాడిహత్నూర్ గ్రామంలో నిర్వహించిన తెరివి (పెద్ద కర్మ) కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్, ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న, డీసీసీబీ చైర్మన్ భోజారెడ్డిలు పాల్గొన్నారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

నిధులు మంజూరు

నేరడిగొండ: మండలంలోని బుగ్గారం(బి), తేజాపూర్ గ్రామాలకు బీటీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరైనట్లు ఎంపీపీ రాథోడ్ సజన్ తెలిపారు. కుంటాలకు రోడ్డు నుంచి బుగ్గారం(బి), గ్రామం వరకు రూ.80 లక్షలు, బుద్దికొండ బీటీ రోడ్డు నుంచి వయా తేజాపూర్ బోథ్ రోడ్డు వరకు రూ.43.64 లక్షల నిధులను కలెక్టర్ రాహుల్‌రాజ్ మంజూరు చేసి జీవో విడుదల చేసినట్లు పేర్కొన్నారు.